రైతుల సమస్యను పరిష్కరిస్తాం

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ


పోతేపల్లి రైతులతో కలిసి డ్రెయినేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

కోనేరుసెంటర్: పోతేపల్లి గ్రామ రైతులు ఎదుర్కొంటున్న డ్రెయినేజీ సమస్యను రైల్వే అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన బందరు మండలం పోతేపల్లి గ్రామాన్ని సందర్శించి రైల్వే, డ్రెయినేజీ అధికారులతో కలిసి రైతులు ఎదుర్కొంటున్న డ్రెయినేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నాయకులు, రైతులు కలెక్టర్‌తో మాట్లాడుతూ గతంలో బందరు, గుడివాడ రైల్వేట్రాక్ డబుల్ లైన్ పనులు చేపట్టగా రైల్వే భూమి నుంచి వెళ్లే డ్రెయిన్ మొత్తం పూడుకుపోవటంతో వర్షాలకు డ్రెయిన్ ఎదురు తన్ని పొలాలు మునిగిపోతున్నాయన్నారు. దీంతోపాటు గ్రామంలోకి నీరు చేరి రోడ్లు మునిగిపోతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. విషయాన్ని విన్న కలెక్టర్ డ్రెయిన్‌కు రెండు వైపులా పరిశీలించి ఆర్‌డీవో, రైల్వే, డ్రెయినేజీ అధికారులతో చర్చించారు. డౌన్ స్ట్రీమ్ రైల్వే ట్రాక్ పక్కన డ్రెయినేజీ తవ్వితే ట్రాక్ కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉందని రైల్వే అధికారులు తెలుపగా అందుకు కలెక్టర్ రైల్వే ట్రాక్ భద్రతపై ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారం రోజుల్లో ఆయా అధికారులు కూడా పరిశీలించే విధంగా చూడాలని సూచించారు. డ్రెయినేజీ సమస్యకు పరిష్కారాన్ని వీలైనంత త్వరగా చూపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాలాజీ వెంట బందరు ఆర్డీవో ఎం. వాణి, డ్రెయినేజీ శాఖ డీఈ బి.కిరణ్, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఆర్.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే డయేరియా నివారణ


ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి మీనాదేవి, వైద్య సిబ్బంది తదితరులు

పెడన: అవగాహనతోనే డయేరియాను నిలువరించవచ్చనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, ఈ విషయంలో ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య, విద్య విస్తరణాధికారి బి.శివసాంబరెడ్డి అన్నారు. మంగళవారం పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా డే సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కె.మీనాదేవి అధ్యక్షతన స్టాప్ డయేరియా క్యాంపెయిన్, డెంగీ మాసోత్సవ కార్యక్రమాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారి వెంట కొనసాగి తిరిగి పెడన పీహెచ్‌సీకి చేరింది. ఆశా డే సమావేశంలో శివసాంబిరెడ్డి మాట్లాడుతూ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమం ఆగస్టు 31వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లిన సమయంలో ఐదేళ్లలోపు వయస్సు గల చిన్నారులుంటే ఆ ఇంటికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లను, జింక్ మాత్రలను అందించాలన్నారు. ఆ కుటుంబానికి అతిసార వ్యాధి గురించి దాని నివారణ పట్ల, ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేయుట, వాడు విధానం గురించి అవగాహన కల్పించాలన్నారు. చిన్న పిల్లలకు విరోచనాలైతే శుభ్రమైన పాత్రలో తయారుచేసిన ఓఆర్ఎస్ ద్రావణాన్ని ప్రతి విరోచనం అయిన తర్వాత పట్టించాలనే విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. దీనితో పాటు తాగునీరు లేదా తల్లిపాలలో బాగా కలిపిన జింక్ టాబ్లెట్లను 14 రోజులు పాటు వాడలనే విషయాన్ని చెప్పాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే వాడవలని సూచించారు. యూనిట్ మలేరియా అధికారి ఎ.మురళి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ డెంగీ వ్యాధి నుంచి రక్షణ పొందాలన్నారు. జిల్లా ఆరోగ్య విద్యా బోధకుడు బి రాజేంద్ర కుమార్, సీహెచ్‌వో ఈఎంఆర్ కుమారి, పీహెచ్ఎన్ఎల్ సౌదామని, ఎంపీహెచ్‌వో ఎం.సుధాకర్, మణెమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపర్చండి


కోనేరు సెంటర్‌లో పారిశుద్ధ్యంపై సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం పురపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన నగరంలోని బస్టాండ్, కోనేరు సెంటర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. జూన్ 29వ తేదీ శనివారం కలెక్టర్ కోనేరు సెంటర్ సందర్శించిన సమయంలో జెడ్పీ సెంటర్ వైపు వెళ్లే మార్గంలో డస్ట్ బిన్ తొలగించి, పూల కుండీలు, బయో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల ప్రకారం నగర కమిషనర్ సీహెచ్ వీవీఎస్ బాపిరాజు వీటిని ఏర్పాటు చేయగా, కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కోనేరు సెంటర్‌లోని చల్లపల్లి రోడ్డు వైపు డస్ట్‌బిన్ తొలగించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కాపలా మనిషిని ఉంచాలని కలెక్టర్ కమిషనర్‌ను ఆదేశించారు. పండ్ల వర్తకులతో మాట్లాడి ఆయా షాపుల నుంచి చెత్త సేకరించుటకు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. బస్టాండ్ సెంటర్ సమీపంలో టీటీడీ కల్యాణ మండపం ఎదుట డస్ట్ బిన్ కలెక్టర్ పరిశీలించారు. నగరంలో దశలవారీగా డస్ట్‌బిన్‌లను తొలగించి, పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో కమిషనర్ బాపిరాజుతో పాటు నగర పాలక సంస్థకు చెందిన పలు విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపును అరికట్టాలి


తహసీల్దార్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న సర్పంచి శ్యామ్, గ్రామస్తులు

నాగాయలంక: రేషన్ బియ్యం దళారుల ఆధ్వర్యంలో నాగాయలంక మండలం నుంచి అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యం రవాణాను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ వక్కపట్లవారిపాలెం సర్పంచి అంబటి శ్యాప్రసాద్ మంగళవారం తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆహార భద్రత కోసం ఏర్పాటు చేసిన పౌరసరఫరాల శాఖ నిర్వహిస్తున్న ప్రజా పంపిణీ పూర్తిగా దుర్వినియోగం అవుతోందని, కేవలం నాలుగైదు శాతం లబ్ధిదారులే ఈ బియ్యం వినియోగించుకుంటున్నారని, మిగతా వన్నీ దళారుల అక్రమ కొనుగోళ్లు, రవాణాతో ఇతర రత్రా అవసరాలకు తరలిపోతోందని, మళ్లీ రీసైక్లింగ్‌తో ప్రజల నెత్తినే భారం మోపుతున్నారని ఆయన పేర్కొన్నారు. పేదలకు రేషన్ బియ్యం నేరుగా చేరేందుకు బయో మీటరింగ్ విధానమే సరైనదని, 243 వేల కోట్ల వ్యయంతో పీడీఎస్ బియ్యం సరఫరా సాగుతున్నప్పటికీ పథకం రానురాను నిర్వీర్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నవారిని తక్షణం అరికట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రేవు సువర్ణరాజు, వక్కపట్ల వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూడు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా

పెడన: పెడన పురపాలక సంఘ పరిధిలోని పుర ప్రజలకు తాగునీటి సరఫరా ఇక నుంచి మూడు రోజులకు ఒకసారి సరఫరా అవుతుందని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరకటూరు సమ్మర్ స్టోరేజీలో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో అక్కడ నుంచి నీరు పెడన పురపాలక సంఘానికి తక్కువగా విడుదలవుతుందని, అందుకు అనుగుణంగా పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. 1, 2, 3వ వార్డులతో పాటు 17వ వార్డు నుంచి 23వ వార్డు వరకు ఉన్న ప్రజలకు 3వ తేదీన నీటిని సరఫరా చేసి తిరిగి 6వ తేదీన సరఫరా చేయడం జరుగుతుందని వివరించారు. అదే విధంగా 4 నుంచి 16వ వార్డు వారికి 4వ తేదీన నీటిని సరఫరా చేసిన తరువాత తిరిగి వీరికి ఏడో తేదీన నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పుర ప్రజలు జాగ్రత్తగా సద్వినియోగం చేసుకుని నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

స్నేహితుడి స్ఫూర్తిగా సేవలు


రావివారిపాలెంలో సాగర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్నేహితులు, గ్రామస్తులు

రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని రావివారిపాలెం రామాలయం వద్ద రావి సాగర్ 24వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. మోపిదేవి జెడ్పీపాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కంతంనేని కుటుంబరావు అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. సాగర్ కృష్ణా నదిలో పడి కొన్నేళ్ల క్రితం మరణించాడు. ఈ నేపథ్యంలో అప్పటి నుంచి ప్రతి ఏడాది సాగర్ జ్ఞాపకార్థం మిత్రబృందం గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత ఏడాది సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయగా, ఈ ఏడాది 300 పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తమ వంతు సహాయం తప్పకుండా ఉంటుందని గ్రామ పెద్దలకు హామీ ఇచ్చారు. రావి రామయ్య, పరుచూరి రాంబాబు, కావూరి కోదండ రామయ్య, రావి సాంబశివరావు, కావూరి నరేంద్ర, రావి హేమంత్ పాల్గొన్నారు.

వీర జవాన్ నాగరాజుకు నివాళి


నాగరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫాదర్ జోజిరెడ్డి తదితరులు

పెడన: మండలంలోని చేవేంద్ర గ్రామానికి చెందిన వీర జవాను సాదరబోయిన నాగరాజుకు పెడన సెయింట్ విన్సెంట్ పల్లోటి హైస్కూలు మంగళవారం ఘనంగా నివాళులర్పించింది. తూర్పు లద్దాఖ్‌లోని నదిలో సైనిక విన్యాసాల్లో నాగరాజు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో దేశసైనికుడు నాగరాజు ప్రమాదవశాత్తు చనిపోవడం చాలా బాధాకరమని పల్లోటి స్కూలు కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి అన్నారు. మంగళవారం నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నాగరాజు దేశానికి అంకితభావంతో చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆ దేవుని ఆదరణ కుటుంబీకులకు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ యాకోబు, డీన్స్, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలో 99.34 శాతం పింఛన్ల పంపిణీ

పెన్షన్ల పంపిణీలో జిల్లాలో మొదటి స్థానం

కోడూరు: పింఛన్ల పంపిణీలో కోడూరు మండలం జిల్లాలో మొదటిస్థానంలో నిలిచింది. జూలై నెలకు సంబంధించి పింఛన్లను సోమ, మంగళవారాల్లో సచివాలయ, పంచాయతీ సిబ్బంది పంపిణీ చేశారు. మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి 7,380 పింఛన్లు ఉండగా సిబ్బంది 7,331 మందికి పంపిణీ చేసి 99.34 శాతం సాధించారు. లబ్ధిదారులకు రూ.4.89 కోట్ల నగదును అందించారు. పింఛన్ల పంపిణీలో సచివాలయ, పంచాయతీ సిబ్బందితో పాటు పాఠశాలల్లోని ఆఫీస్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీని విజయవంతంగా పూర్తి చేసి మండలాన్ని మొదటిస్థానంలో నిలిపిన సిబ్బందిని ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగదేవతి అభినందించారు.

ఘంటసాల: మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో 7, 215 మంది పింఛన్లు ఉండగా మంగళవారం సాయంత్రానికి 7,139 మందికి పంపిణీ చేసి 98.95 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ మంగళవారం తెలిపారు. ఇంకా మండలంలో గ్రామ సచివాలయాల్లో ఇంకా 76 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా వారిలో 45 మంది మరణించగా, మిగిలిన 31 మంది ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లు ఎంపీడీవో మారుతీ శేషమాంబ తెలియజేశారు.

దాత సాయంతో ముళ్లచెట్ల తొలగింపు


బర్రంకుల-బిల్లీగ్రాహంనగర్ రోడ్డులో ముళ్లకంప తొలగిస్తున్న పొక్లెయినర్

పర్రచివర(నాగాయలంక): మండలంలోని పర్రచివర గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్ల తొలగింపునకు బిల్లీ గ్రాహంనగర్‌కు చెందిన గ్రామ పెద్ద మంచాల తిరుపతి వరప్రసాద్ (బాబు) ముందుకొచ్చి జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. నిత్యం పంచాయతీ, దిగువ గ్రామాల ప్రజలు రోడ్డుకు రెండు వైపులా ఏపుగా పెరిగిన ముళ్లచెట్లతో పడుతున్న ఇబ్బందులు గుర్తించి పొక్లెయిన్‌తో వాటి తొలగింపు చర్యలు చేపట్టాడు. పంచాయతీ పరిధిలోని గ్రామాలలో 10 కి.మీ మేర రోడ్లు ఈ విధంగా ముళ్ల కంప తొలగించేందుకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు అయ్యే ఖర్చును భరించేందుకు ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకొచ్చి ఆయన పర్యవేక్షణలోనే గత రెండు రోజులుగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేయిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో బర్రంకుల అడ్డరోడ్డు నుంచి బిల్లీగ్రామ్ నగర్ (2కి.మీ), పుల్లయ్యగారిదిబ్బ రోడ్డు (1.5కి.మీ)లను జంగిల్ క్లియరెన్స్ చేశారు. మిగిలిన రహదారులపై కూడా ముళ్లచెట్లు తొలగించి ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఈపనులు చేపట్టినట్లు బాబు చెప్పారు. సొంత ఖర్చుతో రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లచెట్ల తొలగింపునకు ముందుకొచ్చిన బాబు ను పర్రచివర గ్రామ సర్పంచి శ్రావణి, కార్యదర్శి మల్లికార్జున్, పంచాయతీ ప్రజలు అభినందించారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ చిన్ని, చిత్రంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు

మచిలీపట్నం టౌన్: నగరంలోని 37వ డివిజన్ రాజుపేట వడ్డి రంగారావు మున్సిపల్ యూపీ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను మాజీ కౌన్సిలర్ రాయపూడి ప్రసాద్ (చిన్ని) మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో రూ.20 వేలు వెచ్చించి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన పలు వసతులు ఇప్పటికే వనగూరాయన్నారు. ఆర్వో ప్లాంట్‌తో పాఠశాలలో చదివే విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యూ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మృతి


మహ్మద్ జిన్నాజానీ (ఫైల్)

కోడూరు: కోడూరు మసీదు అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మహ్మద్ జిన్నాజానీ (60) మృతి చెందారు. జిన్నాజానీ అనారోగ్యం కారణంగా మచిలీపట్నంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. జిన్నాజానీ గతంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా, కోడూరు పంచాయతీకి వార్డు సభ్యుడిగా పని చేశాడు. ముస్లిం నేతగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. వివిధ రాజకీయ పార్టీల నేతలు జానీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు పిలుపునిచ్చారు. స్థానిక బీజేపీ కార్యాలయఆవరణలో మంగళవారం ఆయన మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన పిలుపు మేరకు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటామన్నారు. పెడన మండలం చేవెంద్రకు చెందిన వీరజవాన్ నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగరాజు భార్యకు రూ.10 వేల విలువైన చెక్కును అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు తుంగల మురళి, పుప్పాల రాము, నాయకులు పంతం గజేంద్రరావు, వైవీఆర్ పాండురంగారావు, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, అభినందన, పి.రమణ, సిద్ధార్థ, ఏసురాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

శ్రీకాకుళం(ఘంటసాల): విద్యార్థులకు దాతలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్లో చదివే విద్యార్థులకు పూర్వవిద్యార్థి వంశీ కృష్ణ, మరోదాత మురాల శివాజీ కలిసి 135 భోజనం ప్లేట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ తాను పేదరికం వలన ఇదే పాఠశాలలో 10వ తరగతి వరకే చదువుకుని ఉన్నత విద్యకు వెళ్లలేకపోయానన్నారు. విద్యార్థులంతా ప్రభుత్వం, దాతల సేవలను సక్రమంగా వినియోగించుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పీడీ బి.వెంకటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కేవీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత


రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత, శాస్త్రవేత్తలు

చల్లపల్లి(ఘంటసాల): ఎస్సీ రైతులకు ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత మంగళవారం అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం వారు 2024-25 కార్యకలాపాలు, విధుల్లో భాగంగా వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్ ఆధ్వర్యంలో ఎస్సీ ఉప ప్రణాళికలో భాగంగా షెడ్యూల్డ్ కులాల రైతులను వ్యవసాయ పరంగా దత్తత తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా చల్లపల్లి మండలం మంగళాపురం, మోపిదేవి మండలం వెంకటాపురం గ్రామాల్లోని ఎస్సీ రైతులకు, కౌలు రైతులకు ఎంటీయూ 1318 వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ ఎస్సీ ఉప ప్రణాళికలో భాగంగా మంగళాపురం, వెంకటాపురం ఎస్సీ రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశామన్నారు. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గించడంతో పాటు చేయూత ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా పలు రకాలుగా సహకారం అందిస్తుందన్నారు. దీనిలో భాగంగా వరి పంటలో మేలైన కొత్తరం ఎంటీయూ 1318 వరి విత్తనాలను 140 ఎకరాలకు సంబంధించి 140 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. వ్యవసాయ పరంగా సమస్యలను పరిష్కరించడానికి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో సంప్రదించి, తగిన సూచనలు, సలహాలు పొంది అధిక దిగుబడులు సాధించాలని శ్రీలత ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి


కమ్యూనిటీహాలుకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సర్పంచి రాణికి అర్జీ ఇస్తున్న యువకులు

కొడాలి(ఘంటసాల): ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాలుకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని కోరుతూ కొడాలి సర్పంచ్ సీహెచ్.రాణికి గ్రామస్తులు, యువకులు మంగళవారం అర్జీ సమర్పించారు. ఘంటసాల మండలం కొడాలి ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాలు భవనం నందు గ్రామస్తులు దాతల సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేసుకుంటున్నారు. కమ్యూనిటీ హాలు నందు విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ తరుపున కమ్యూనిటీ హాలులో విద్యుత్తు మీటరు, విద్యుత్తు సదుపాయం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు, యువకులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని సమస్యను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ రాణికి అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో పి.సురేష్, సీహెచ్.బన్ను, జె.ప్రవీణ్, జి.కార్తీక్, సీహెచ్.శశి, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

కోడూరు: దివంగత వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకొని ఈ నెల 4న లయన్స్ క్లబ్ కోడూరు-దివిసీమ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్నసాయిబాబు మంగళవారం తెలిపారు. ప్రధాన సెంటర్‌లోని దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో ఉదయం 9గంటల నుంచి ఈ రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని చెప్పారు. యువతీ, యువకులు ఈ శిబిరంలో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సాయిబాబు కోరారు.

క్లుప్తంగా

విద్యా సామగ్రి పంపిణీ



పెడన: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందించే కిట్లను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పెడన జెడ్పీటీసీ అర్జా వెంకట నగేష్ అన్నారు. మంగళవారం ఆయన పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు స్కూలు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న కిట్లలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శీరం ప్రసాద్, వెంకయ్య, సమ్మెట రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులున్నారు.

కృత్తివెన్ను: పేద ప్రజల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాపథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ప్రసాదరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పల్లెపాలెం, నీలిపూడి పాఠశాలల్లోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. పేదల పాలిట ప్రభుత్వ పాఠశాలలు వరంగా మారాయని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, భోజనం అన్ని సౌకర్యాలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నీలిపూడి సర్పంచి, ఎంపీటీసీలు పాశం కృష్ణ, పాశం సుజాత, నాగమల్లేశ్వరరావు, పల్లెపాలెంలో ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, స్థానికులు సత్యనారాయణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూవోకు సన్మానం



అవనిగడ్డ: రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూవో కె.సాల్మన్‌రాజుని సాంఘిక సంక్షేమశాఖ డీడీ సాహిత్‌బాబు ఘనంగా సత్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశపు హాలులో మంగళవారం సాల్మన్‌రాజు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీడీ సాహిత్‌బాబు మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా ఏఎస్‌డబ్ల్యూవోగా సాల్మన్ అందించిన సేవలను కొనియాడారు. ఎంతో సౌమ్యుడిగా పేరొందిన సాల్మన్‌రాజు అందరినీ సమన్వయం చేసుకుంటూ వసతి గృహ విద్యార్థులు మంచి ఫలితాలు అందుకునేలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూవో మోహనరావుతో పాటు అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని హాస్టళ్ల వార్డెన్లు, సిబ్బంది, సాల్మన్‌రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సాయం



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి నారాయణరావు నగర్ ఎస్టీ కాలనీలో గరికపాటి యశోదకు పాస్టర్ గోల్కొండ డేవిడ్, కాజా చేతన్‌బాబు మిత్ర బృందం మంగళవారం రూ.15 వేలు నగదుతో పాటు నిత్యావసర వస్తువులు అందించారు. ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా యశోద ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దీంతో స్పందించిన చేతన్ మిత్ర బృందం బాధితురాలికి, నగదుతోపాటు బియ్యం, వంటపాత్రలు, మంచం, దుప్పట్లు, నూతన వస్త్రాలు, కుర్చీలు, కూరగాయలు, గ్యాస్‌స్టవ్‌తో పాటు కోడి గుడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి భాస్కరరావు, పి.నిరంజన్, దాసి కోటేశ్వరరావు, వి.మోహన్, ఆకుల రవి, జి.రాజశేఖర్, అడపా కోదండ రామయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



అవనిగడ్డ: కోడూరు మండల పరిధిలోని ఎస్టీ (యానాదుల) కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యానాది మహానాడు జిల్లా అధ్యక్షుడు మంగళగిరి శ్రీనివాసరావు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ (రాజా)ని కలుసుకుని శ్రీరాంపురం కాలనీలో ఎస్టీల పక్కాగృహాల శ్లాబులు పెచ్చులూడి పడుతున్నాయని, హరిపురంలో ఎస్టీ కాలనీలో వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఉల్లిపాలెం ఎస్టీ కాలనీలో సగంలో నిలిచిన 20 పక్కా గృహాలను పూర్తి చేయించాలని, ఆరు నెలలుగా ఇక్కడ తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వెంకట్రామ్ హామీ ఇచ్చారు.